క్లుప్తంగా

పత్తికి మద్దతు ధర కల్పించండి..



మాట్లాడుతున్న ఎస్కే ఉమర్

జూలూరుపాడు: పత్తికి రూ.10 వేలు మద్దతు ధర కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్కే ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో పత్తి ధర రూ.6 వేలకు మించడం లేదన్నారు. అధిక వర్షాలకు పత్తి పంట దిగుబడి తగ్గి, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పత్తి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జూలూరుపాడు శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, కొండపనేని సత్యనారాయణ, భద్యా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం నిర్లక్ష్యాన్ని వీడాలి


మాట్లాడుతున్న రాజిరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): కార్మికుల సమస్యలపై గుర్తింపు సంఘం నిర్లక్ష్యం వీడి, వారి సమస్యలపై స్పందించాలని టీబీజీకేఎస్ సెంట్రల్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్లైన్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘాలు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా గుర్తింపు కార్మిక సంఘాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రాజిరెడ్డిని యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: సీతారాంపట్నంలోని 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా పట్టణ, మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాల్వంచ: పట్టణంలో విద్యుత్ మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ, నవభారత్, పాత పాల్వంచ, కిన్నెరసాని రోడ్, గాంధీనగర్, ఒడ్డుగూడెం, గట్టాయిగూడెం, శ్రీనివాస కాలనీ, కరకవాగు, అయ్యప్పనగర్ తదితర ఏరియాలకు ఉదయం 9గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

టేకులపల్లి: కోయగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బొమ్మనపల్లి విద్యుత్ శాఖ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీపీఐ సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వం అందజేస్తున్న నరేంద్ర కుమార్

జూలూరుపాడు: సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్ జూలూరుపాడులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం పేద ప్రజా సమస్యల కోసం పాలకులపై ప్రజా పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని, ఎర్ర జెండా పేదలకు అండగా ఉంటుందన్నారు. గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్ పాషా, కంచర్ల రాఘవేంద్రరావు, దర్శనాల లక్ష్మీనారాయణ, గార్లపాటి శివక్రిష్ణ, భూక్యా భద్రు, నరసింహారావు పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య వనభోజనాలు

పాల్వంచ: కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం నవభారత్‌లోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఆర్యవైశ్యుల వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చలవాది ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఆర్యవైశ్యులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

పరమశివుడికి ప్రీతిపాత్రమైన కార్తీకపౌర్ణమిని శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మహిళలు ఉపవాసదీక్ష ఆచరించడంతోపాటు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు పోటెత్తారు. బిల్వ దళాలు, జిల్లేడు పూలతో ప్రత్యేకంగా పూజ చేసి, పాలతో శివలింగానికి అభిషేకం చేశారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు. ప్రమిదలు, ఉసిరికాయల్లో కార్తీక దీపాలు వెలిగించారు. పలువురు మహిళలు తమ ఇంటి ప్రాంగణంలో ఆవు నెయ్యితో తులసి మొక్క వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: శ్రీ హరిహర క్షేత్రంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో..


పాల్వంచ: ఆత్మలింగేశ్వరాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని


టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో పూజలో పాల్గొన్న ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్


టేకులపల్లి రామాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న మహిళలు


పాల్వంచరూరల్: శ్రీలలిత కామేశ్వరి ఆలయంలో


పాల్వంచ: శ్రీనివాస కాలనీ శివాలయం వద్ద


టేకులపల్లి: సిద్ధారం అడవిలో వెలిసిన శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


టేకులపల్లి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో..


ఇల్లెందురూరల్: పూజ చేస్తున్న మహిళలు


జూలూరుపాడు: పాపకొల్లు శివాలయంలో..


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


అభిషేక పూజలు చేస్తున్న భక్తులు


ఇల్లెందురూరల్: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పాల్వంచ: నవభారత్ రామలింగేశ్వరాలయంలో భక్తుల కోలాహలం

ఘనంగా 'ప్రియదర్శిని'లో ఫ్రెషర్స్ డే


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మారిన సెమిస్టర్ విధానానికి అనుగుణంగా విద్యను అభ్యసించి ఉన్నత ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామనేని చలపతిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాశిపల్లి రమేష్, డ్యాన్స్ మాస్టర్ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లపై సీఎం వ్యాఖ్యలు గర్హనీయం

ఇల్లెందురూరల్: బాలల దినోత్సవం సందర్భంగా ప్రైవేటు టీచర్లను కించపరిచేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని బీఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపాటి నరేష్ అన్నారు.

కొమరారంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ కొలువులు లభించక ప్రైవేటు విద్యా సంస్థల్లో చాలీచాలని వేతనంతో అనేక మంది నిరుద్యోగులు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారు తమ మేధస్సుతో చక్కగా విద్యాబోధన చేస్తుంటే తక్కువ చేసి మాట్లాడం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు.

ఘనంగా మంత్రి తుమ్మల జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జూలూరుపాడు: రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడులోని ఆ పార్టీ కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూధన్‌రావు, బానోత్ నవీన్, కొడుమూరి కోటేశ్వరరావు, కొలిపాక వెంకటేశ్వర్లు, నున్నా రంగారావు, నున్నా కృష్ణయ్య, నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, వాంకుడోత్ కిషన్ నాయక్, రాంశెట్టి నాగేశ్వరావు, ఎండపల్లి చిట్టిబాబు, గుగులోత్ ప్రియాంక, లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గా ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన గోర్ బంజారా పోరాట సమితి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘర్షణలో అమాయక గిరిజనులపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అగ్రవర్ణాల లబ్ధి కోసం ఫార్మా కంపెనీ పేరుతో గిరిజనుల భూములు లాక్కోవడం సమంజసం కాదన్నారు. రిమాండ్‌లో ఉన్న గిరిజనులను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీతారాం నాయక్, భూక్యా చరణ్, రాంబాబు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కొండగల్ నియోజకవర్గంలో గిరిజనులపై పోలీసులు దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మండలశాఖ మాజీ అధ్యక్షుడు ఆజ్మీర భావ్‌సింగ్ అన్నారు. మండలంలోని రొంపేడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న పాలకులు ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం దౌర్జన్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజల అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదన్నారు. సమావేశంలో వీరన్న, భార్గవ్, రాంజీ, భీమా, శంకర్, లక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


సోములగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోములగూడెం గ్రామ శివారులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు దళారీలను ఆశ్రయించవద్దన్నారు. తేమ, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏఓ శంకర్, డీటీ శ్రీనివాసులు, ఎంపీఓ బి.నారాయణ, ఆర్ఐ.హచ్యా, కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వరణ్, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా, రాష్ట్రనాయకులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సొసైటీ వైస్‌చైర్మన్ కాంపెల్లి కనకేష్, మాజీ ఎంపీటీసీ ఎం.మోహన్‌రావు, డైరెక్టర్లు బుడగం మోహన్‌రావు, కనగాల నారాయణ, చౌగాని పాపారావు, మైనేని వెంకటేశ్వరరావు, భూక్యా కిషన్, బర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాలపై ప్రత్యేక దృష్టి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): గిరిజన తండాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లాలుతండా గ్రామపంచాయితీకి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం స్థానిక శేషగిరిభవన్‌లో కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడానే. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సేవలు అందించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని అన్నారు.

డయల్ యువర్ డీఎంకు వినతుల వెల్లువ

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ పాల్గొనగా పలువురు ఫోన్ చేసి సమస్యలు వెల్లడించడంతోపాటు కొత్త సర్వీసులు ప్రారంభించాలని కోరారు. ఇల్లెందు నుంచి వయా కాంచనపల్లి మీదుగా ఆళ్లపల్లి మర్కోడుకు, కొత్తగూడెం నుంచి వయా అనిశెట్టిపల్లి, అనంతోగు, కాంచనపల్లి మీదుగా గుండాల వరకు బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఖమ్మం నుంచి కొత్తగూడెం, పాల్వంచ వరకు ఉదయం, సాయంత్రం ఆర్డినరీ బస్సు నడిపించాలని, ఇల్లెందు నుంచి గుండాల వరకు బస్సు సమయం మార్చాలని, ఇల్లెందు నుంచి గుండాల, పస్రా, ములుగు మీదుగా, ఏటూరునాగారానికి సర్వీస్ ఏర్పాటుచేయాలని కోరారు. ఇంకొన్ని రూట్లలో అదనపు బస్సులు నడిపించాలని కోరగా పరిశీలిస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఏజే రమేష్

ఇల్లెందు: వచ్చే నెలలో ఇల్లెందులో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు ఎన్నిక చేసిన ఆహ్వాన సంఘంను సీపీఎం ప్రకటించింది. శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశం ఇల్లెందులో ఏలూరి భవన్‌లో జరిగింది. రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన పట్టణ, మండల స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఎన్నిక చేసినట్లు ప్రకటించారు.

ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య, అధ్యక్షుడిగా పట్టణ ప్రముఖ వ్యాపార వేత్త జుగల్ కిషోర్ ఖండేల్‌వాల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ఏ నబీ, వివిధ రంగాలకు చెందిన 167 మందితో ఆహ్వాన సంఘం పని చేస్తుందని తెలిపారు. సీపీఎం ఏర్పడిన నాటి నుంచి బొగ్గు గనులకు పుట్టినిల్లైన ఇల్లెందులో తొలిసారి మహాసభలు జరుగబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదారపు వెంకటేశ్వర్లు, కిరణ్, కృష్ణ, ఖాదర్, జైబున్నిసా, రాము, సంధ్య, సుల్తానా పాల్గొన్నారు.

సమాజంలో మీడియా పాత్ర కీలకం..


జీఎంను సత్కరిస్తున్న మీడియా సభ్యులు

ఇల్లెందు: సమాజం మరింత పురోభివృద్ధితో ముందుకు సాగాలంటే మీడియా రంగం పాత్ర కీలకం అని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. శుక్రవారం 24 ఏరియా ఆఫీసర్స్ క్లబ్‌లో ఇల్లెందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని మీడియా ప్రపంచానికి తెలుపుతుందన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా మీడియా పని చేస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ఇతర రంగాల్లో జరిగే మంచి, చెడును వెలికి తీసే స్వేచ్ఛ మీడియాకు ఉందన్నారు. తాను 41 ఏళ్ల క్రితం ఇల్లెందులోనే ఉద్యోగంలో చేరానని, అదే ఇల్లెందులో ఈ నెలాఖరు నాటికి ఉద్యోగ విరమణ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం జాన్‌ఆనంద్‌ను ఘనంగా మీడియా సభ్యులు సత్కరించారు. అధికారుల సంఘం అధ్యక్షులు శివప్రసాద్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణ మోహన్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జీఎంను సత్కరించిన వాకర్స్ క్లబ్

పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసిన సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను వాకర్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం గ్రౌండ్‌లో శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. దంతాల ఆనంద్, చాగర్ల సంతోష్, ఎస్.రంగనాథ్, గిన్నారపు రాజేష్, నాగేశ్వరరావు, పరుచూరి వెంకటేశ్వర్లు, సాంబ మహేష్ ఉన్నారు.

యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ వేతన చట్ట ప్రకారం అసంఘటిత స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు కార్మికులు, వ్యవసాయ కార్మికులందరికీ సామాజిక భద్రత ప్రయోజనాలను కల్పించాలని కోరారు. రైతులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, 12 డిమాండ్లపై సమావేశంలో చర్చించి ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

బిర్సా ముండా త్యాగాలను మరవొద్దు..

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో బిర్సా ముండా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ఆదివాసీలలో సామాజిక, సాంస్కృతిక మార్పు కోసం పోరాడిన వీరులలో బిర్సా ముండా ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఆదివాసుల ఆరాధ్య దైవమైన బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా శుక్రవారం టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పీసా గ్రామసభలు నిర్వహించారు. టేకులపల్లి పంచాయతీలో జరిగిన గ్రామ సభకు ఎంపీడీఓ జి.రవీంద్రరావు హాజరయ్యారు. పీసా చట్టం పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు పీసా, ఫారెస్ట్ గిరిజన చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివాసీ గిరిజన వీరుడు భగవాన్ బిర్సా ముండా 150 జయంతి వేడుకలను తోగ్గూడెం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం గ్రామసభను నిర్వహించారు. సభలో పంచాయతీ అభివృద్ధిపై ప్రణాళికను రూపొందించారు. లక్ష్మీదేవిపల్లిలోని కుమురంభీం భవనంలో జరిగిన బిర్సా ముండా జయంతి వేడుకలో సోయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ, దశరాజ్, అరెం ప్రశాంత్, తాటిపుల్లయ్య, కొమరం జనార్ధన్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: భగవాన్ బిస్రా ముండా త్యాగం, పోరాటపటిమను మరవరాదని కొత్తగూడెం డీపీఓ చంద్రమౌళి అన్నారు. బిస్రా ముండా 150వ జయంతి సందర్భంగా శుక్రవారం కరివారిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక గ్రామసభకు డీపీఓ చంద్రమౌళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బిస్రా ముండా జయంతి సందర్భంగా గిరిజన ఆత్మగౌరవ దినోత్సవం నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎల్పీఓ రమణారావు, ఎంపీఓ టి.తులసీరామ్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, గిరిజనులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ప్రజలు, అధికారులు


పాల్వంచరూరల్: తోగ్గూడెం గ్రామంలో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ


జూలూరుపాడు: కరివారిగూడెంలో మాట్లాడుతున్న డీపీఓ చంద్రమౌళి